

బోటింగ్ డ్రెస్‌లో చంద్రబాబు



పరమ సముద్రం చెరువులో చంద్రబాబు బోటింగ్



హంద్రీ-నీవా కాలువ వద్ద జనం హర్షాతిరేకాల నడుమ జలహారతి ఇస్తున్న చంద్రబాబు

నిలువెల్లా పులకింత.. జనమెల్లా కేరింత!

- జలహారతిలో మెరిసిన 'చంద్ర'హాసం
- సీఎం కుప్పం పర్యటన విజయవంతం

పంచెకట్టులో నిండైన రూపం.. పెదవులపై చెరగని దరహాసం..ఆనందంతో జనాలకు అభివాదం.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటిలా కాకుండా భిన్నంగా కనిపించారు, వ్యవహరించారు. అధినేతకు జేజేలు.. ప్రాంగణమంతా ఈలలు.. మాటమాటకీ పట్టలేని ఆనందంతో గోలగోలలు.. జడత్వాన్ని వదుల్చుకున్న జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. చంద్రబాబులో ఎన్నడూ లేని పులకింత కనిపించగా.. జనంలో నిస్తేజం పటాపంచలై కేరింతలతో వెల్లువెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఎప్పటిలా కాకుండా, నూతనత్వంతో ఆద్యంతం ఉత్సాహం ఉరకలు వేసేలా విజయవంతంగా సాగి ముగిసింది.



సభకు హాజరైన జనం- చంద్రబాబు అభివాదం



హంద్రీనీవా పైలాన్ ఆవిష్కరణ

కుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 738 కిలోమీటర్లు సాగి, తరలి వచ్చిన కృష్ణమ్మకు కుప్పంలోని పరమసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం జలహారతి ఇచ్చారు.ఆ సమయంలో ఆయన ఆహార్యం చూసిన జనం ఆశ్చర్యపోయారు. శాంతిపురం మండలంలో ఇటీవలి స్వగృహ ప్రవేశంలో తప్ప, ఆయన కుప్పం ప్రజలకు ఎన్నడూ, ఏ కార్యక్రమంలోనూ పంచెకట్టులో కనిపించకపోవడం, ఇప్పుడు నిండైన పంచెకట్టుతో కనువిందు చేయడమే వారి ఆశ్చర్యానికి కారణం. కేవలం జలహారతి సమయంలోనూ కాదు.. తర్వాత జరిగిన బహిరంగ సభలో కూడా ఆయన పంచెకట్టు, షర్టుతోనే పాల్గొనడం వారిలో మరింత ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగించింది. తెలుగు సంప్రదాయంలో గంగమ్మను పూజించుకోవడమే కాక, సంప్రదాయ దుస్తులను పర్యటన ఆద్యంతం ధరించడం ప్రధాన విశేషంగా ప్రజలు చెప్పుకున్నారు. అంతేనా.. చంద్రబాబు ప్రసంగం ఎప్పటిలా హైహై గా సాగలేదు. జలాలు.. పొలాలు.. హలాలు.. ఆయన వాక్యంలో అడుగడుగునా పలకరించాయి. సభ ప్రారంభంనుంచి ముగిసే వరకూ ఆయన పెదవులపై సంతృప్తికర హాస రేఖలు తొంగిచూశాయి. షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు కచ్చితంగా ఉదయం 10.30గంటలకు శాంతిపురం మండలం కడపల్లె వద్ద గల ఇంటినుంచి బయటకు వచ్చి వివిధ పథకాల లబ్ధిదారులతో అప్పటికే నిండిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఒక కుటుంబ సభ్యుడిలా వారిని పలుకరిస్తూ, కష్టసుఖాలు ఆరాతీస్తూ, పథకాల ద్వారా పొందుతున్న లబ్ధి వివరాలు తెలుసుకుంటూ పరమసముద్రం చెరువు వద్దకు చేరుకున్నారు. సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో ముహూర్తం వేళ అయిన ఉదయం 11.30 గంటలకు జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు పూజలు చేశారు.తర్వాత పైలాన్ ఆవిష్కరణకు ముందు హంద్రీ-నీవా రూట్ మ్యాప్ పరిశీలించారు. సంబంధిత ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్ సందర్శించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఆయా వివరాలను సీఎంకు వివరించారు. కాలువ పొడవునా సీసీ కెమెరాలు పెట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని, హంద్రీ-నీవా కాలువ ప్రయాణం, అందుకు ప్రభుత్వం పడిన ఇబ్బందులు, సాధించిన విజయాలు, ఫలితాలను సూచించేలా, చిన్నలు పెద్దలకు అర్థమయ్యేలా నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర కేంద్రాలలో ప్రత్యేకమైన ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు ఎంత వ్యయమైనా భరించేందుకు తాను సిద్ధమన్నారు. అనంతరం హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తయి కృష్ణా జలాలు కుప్పం చేరినందుకు గుర్తుగా నిర్మించిన పైలాన్‌ను ఉదయం 11.50 గంటలకు ఆవిష్కరించారు.అనంతరం చంద్రబాబు జనాల ఆనందాన్ని పంచుకుంటూ వారితో కలిసి సెక్యూరిటీ లేకుండా కాలువ గట్టు వెంట పరమసముద్రం చెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. అక్కడ అప్పటికప్పుడు సిద్ధం చేసిన బెలూన్ తెప్పలో ఎక్కి చెరువంతా కలియ దిరిగారు. ఈ కార్యక్రమం షెడ్యూల్‌లో లేకపోయినా ఆయనలో ఉరకలు వేసే ఉత్సాహం ఈ పనిచేయించింది. తర్వాత సుమారు గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.45 గంటలకు బహిరంగ సభావేదికకు చేరుకున్నారు.

● ఉరవడిగా సాగిన ప్రసంగం

సాధారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం పడికట్టు పదాలతో పునరావృతమయ్యే వాక్యాలతో సాగుతుంది. అయితే జలహారతి సందర్భంగా ఆయన ప్రసంగం ఒక ఉరవడిలో, హంద్రీ-నీవా కాలువలో ఉరకలెత్తే కృష్ణా ప్రవాహంలా సహజ ఉధృతితో సాగింది. మధ్యాహ్నం 1.32 గంటలకు ప్రారంభమైన ఆయన ప్రసంగం ఏకధాటిగా సుమారు 1.15 గంటపాటు కొనసాగి మధ్యాహ్నం 2.45 గంటలకు ముగిసింది. జలాలే జీవితం అని ప్రతిపాదించిన చంద్రబాబు, హంద్రీ-నీవా కాలువను శ్రీశైలంనుంచి కుప్పం దాకా నిర్మించి కృష్ణా జలాలతో కరువు నేలను పావనం చేయడానికి తాను ఎన్ని కష్టాలు పడిందీ, మధ్యలో వైసీపీ పాలనలో ప్రాజెక్టు ఎలా ఆగిపోయిందీ, తిరిగి మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంత పట్టుదలతో కాలువ నిర్మాణం పూర్తిచేసి కృష్ణమ్మను కుప్పం తీసుకు వచ్చిందీ సవివరంగా ప్రజలకు తెలియజెప్పారు. కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయని చమత్కరించిన ఆయన, జలాల ప్రాముఖ్యత, అన్నదాతకు వాటి అవసరం, పాడిపంటలతో జీవితాలు సుఖవంతం కావడం వంటి అంశాలతో గ్రామీణ ప్రాంత ప్రజల మనసులను చూరగొన్నారు. కరువు నేలలో బోర్లు వేసి నీళ్ల పడక నష్టపోయిన రైతు ముఖంలో కృష్ణమ్మ తెచ్చిన ఆనందాన్ని తన మాటల్లో వర్ణించారు. వరి వద్దని, వాణిజ్య పంటలే వేయమని సలహా ఇచ్చారు. తన సహజ శైలికి భిన్నంగా అచ్చమైన రైతు బిడ్డలా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతుంటే సభకు హాజరైన గ్రామీణ జనం మంత్రముగ్ధులై విన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు వేదిక వెనుక ప్రత్యేకంగా వేసిన గుడారంలోకి వెళ్లి, కుప్పంలో ప్రాజెక్టులు నిర్మించనున్న 5 కంపెనీలతో కడా ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నారు.షెడ్యూల్‌లో పేర్కొన్న సమయానికి సుమారు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 6 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరు పయనమయ్యారు.

తిరుప్పావై ఉపన్యాసాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలిచ్చేందుకు వైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుంచి దరఖాస్తులు, అంగీకర పత్రాలను టీటీడీ ఆహ్వానిస్తోంది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏటా ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైనవారు సోమవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 'ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, శ్వేతాభవనం, టీటీడీ, తిరుపతి' అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకర పత్రాలు పంపాల్సి ఉంటుంది. అంగీకార పత్రాలు ఇచ్చే పండితుల పట్టికతో వివరాలను, దరఖాస్తులను టీటీడీ.తిరుమల.ఓఆర్జీ అనే వెబ్‌సైట్ నుంచి పొందచ్చని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

రేపటి నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు పొందలేనటువంటి గిరిజనుల కోసం మండల, మున్సిపల్ కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రాజా సోము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి అవరమైన జనన, నివాస ధృవీకరణ పత్రాలు సైతం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబరు 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ క్యాంపులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడు సింగిల్‌విండోలకు పాలకవర్గాల ఏర్పాటు

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు సింగిల్ విండోలకు ప్రభుత్వం నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలను నియమించింది. చిల్లకూరు సింగిల్ విండో ఛైర్మన్‌గా కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు, సభ్యులుగా ఎద్దల రామకృష్ణారెడ్డి, పెళ్లకూరు గోపాలకృష్ణ నియమితులు కాగా నాయుడుపేట సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా గుండ్లూరు ప్రభాకర్ నాయుడు, సభ్యులుగా ఆళ్ల పరంధామయ్య, బిరదవాడ నారాయణ నియమితులయ్యారు. అలాగే దగ్గవోలు సింగిల్‌విండో ఛైర్మన్‌గా ఈతముక్కల సురేంద్ర, సభ్యులుగా ఈతముక్కల రాజేంద్ర, ఎద్దల ఉదయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ కమిటీల పదవీ కాలం వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు ఉంటుంది. .

రెండు ఎక్స్‌ప్రెస్‌లు రద్దు : హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వరదల నేపథ్యంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం, కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను ఆదివారం రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో శనివారం ఉదయం నుంచి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మూషిక వాహనంపై వినాయకుడి విహారం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు మూషిక వాహనంపై విహరించారు. కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. అనంతరం స్వామికి చందనాలంకారం చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తర్వాత సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను మూషిక వాహనంపై ఉంచి కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. కాగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరఫున ఈవో శీనానాయక్, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్ శనివారం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరిని ఈవో పెంచలకిషోర్ సాదరంగా ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌కు ఈ పట్టు వస్త్రాలను అందించారు.



స్త్రీ శక్తి పథకం భారం కాదు..బాధ్యత

● చంద్రగిరి సభలో ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని - సభకు అశేష సంఖ్యలో హాజరైన మహిళలు

చంద్రగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం భారంగా కాకుండా, బాధ్యతగా భావిస్తోందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం చంద్రగిరిలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరిగింది. ముందుగా నాగాలమ్మ ఆలయం నుంచి అధిక సంఖ్యలో మహిళలతో పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డిలు ర్యాలీగా కొత్తపేటలోని మార్కెట్ ఆవరణకు చేరుకున్నారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ హామీలన్నింటినీ నెరవేర్చిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను కూడా చేపడుతోందన్నారు. నియోజకవర్గంలో ఉద్యోగ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. జిల్లాలో పలు పరిశ్రమలు వస్తున్నాయని, అందులో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అన్నారు. వైసీపీ హయాంలో రాక్షస పాలన సాగించి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందన్నారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సుధారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నియోజకవర్గ పునర్విభజన పేరుతో టీడీపీలో గ్రూప్ రాజకీయాలకు తెరలేపిందని, అలాంటి మాటలు నమ్మవద్దని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనలో సుధారెడ్డి ధైర్య సాహసాలతో పోరాడారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు గాలి పుష్పలత, టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, ముడిపల్లి సురేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, మునిశేఖర్, కేశవులునాయుడు, బెల్లంకొండ మురళి, గిరిధర్‌రెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వజ్ర భైరవ గణపతి హోమం



గణపతికి హారతి ఇస్తున్న రమ్యానంద భారతి

రామచంద్రాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):శక్తి పీఠంలో శనివారం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వజ్రభైరవ గణపతి హోమం వైభవంగా జరిగింది. మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు విజయగణపతి మూలమూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశాక ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 9గంటలకు వేదపండితులు వజ్రభైరవ హోమం ప్రారంభించగా శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి విజయగణపతి స్వామికి మంగళహారతులు ఇచ్చారు. కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిన మహిళలు



భాకరాపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి విజయోత్సవ సభకు తెలుగు మహిళలు భారీగా తరలి వెళ్లారు. చంద్రగిరిలో శనివారం స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ, సభ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి చిన్నగొట్టిగల్లు మండలంలోని 13 పంచాయతీల టీడీపీ శ్రేణులు 10 బస్సులలో భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగ సమానత్వంతోనే సమాజాభివృద్ధి



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న సాయిసుజాత,తదితరులు

చంద్రగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): లింగ సమానత్వంతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని ఎస్వీయూ మహిళా అధ్యాయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సాయి సుజాత అన్నారు. శనివారం చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జెండర్ సెన్సిటైజేషన్-ఈక్వాలిటీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమానత్వం ఒక అంశం కాదని, దైనందిన కార్యక్రమాలతో పాటు అభివృద్ధికి పాటుపడే అంశాలలో భాగమన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని, అన్ని రంగాలలో సమానత్వపు అడుగులు వేయాలన్నారు. జెండర్ సెన్సిటైజేషన్ బుక్‌లెట్ ఆవిష్కరించారు. హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, రిసోర్స్ పర్సన్ సుజాత, ఎన్జీవో జిల్లా పీవో రాజారెడ్డి, రమణ, జగదేశ్వరి, రాజరాజేశ్వరి, సునీత, ఉమాదేవి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఒడిశా హైకోర్టు జడ్జి జస్టిస్ మురహరి, శ్రీరామన్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయక్, బేబీరాణి, కోర్టు పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఎన్‌ఎల్ఆర్ 3648 అనువైన రకం

దొరవారిసత్రం. ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఎన్‌ఎల్ఆర్ 3648 కొత్త రకం వరి వంగడం అనువైనదని నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వినీత, శ్రీలక్ష్మి తెలిపారు. దొరవారిసత్రం మండలం లింగం పాడులో రైతు దిలీప్ సాగు చేసిన ఎన్‌ఎల్ఆర్ 3648 వంగడాన్ని శనివారం స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో శాస్త్రవేత్తలు పరిశీలించారు. కంకెకు ఎన్ని విత్తనాలు, విత్తనాల నిడివి పరిశీలించారు. 20నుంచి 25 దుబ్బులు, ఒక వెన్నులో 250నుంచి 300 వరకు గింజలు ఉన్నట్లు గుర్తించారు. 130 నుంచి 135 రోజులు పంట కాల పరిమితి కలిగిన ఈ వంగడం 35నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఏడీఏ కాంచన, దొరవారి సత్రం ఏవో జ్యోతిర్మయి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

పశువుల వాహనం సీజ్
గోవులు తరలిస్తున్న ముఠాపై కేసు



గోశాలకు తరలించిన పశువులు

చంద్రగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కబేళాకు తరలిస్తున్న పశువుల వాహనాన్ని పోలీసులు శనివారం సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు చంద్రగిరికి చెందిన సయ్యద్ వల్లి, సాదిక్, జాకీర్‌లు తొమ్మిది పశువులను వాహనంలో నెల్లూరు నుంచి పీలేరు వైపు తరలిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి తిరుపతి రూరల్, సీ.మల్లవరం జంక్షన్ వద్ద చంద్రగిరి పోలీసులు అడ్డుకున్నారు. వాహనాన్ని ఆపి విచారించగా, పశువులు కబేళాకు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో వాహనాన్ని సీజ్ చేసి 9 పశువులను ఎస్వీ గోశాలకు తరలించారు. పశువులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రూ.7,516 వేలు పలికిన సుండికండ్రిగ లడ్డు



ఏర్పేడు, ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు మండలం సుండికండ్రిగ గ్రామంలో శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలను గ్రామస్తులు నిర్వహించారు. అంతకుముందు వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. గ్రామానికి చెందిన నీలేష్‌రెడ్డి రూ.7,516కు లడ్డూను దక్కించుకున్నాడు.

కత్తులు, రాడ్లతో దాడి

● ఒకరి మృతి... ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతుడు చందు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల సందర్భంగా కొంత మంది యువకులు గంజాయి, మద్యం మత్తులో కత్తులు, రాడ్లతో దాడి చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి స్థానిక కొర్లగుంట సుభాష్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనలో ఒకు మృతి చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు... సుభాష్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ అశోక్, అతడి స్నేహితులు హేమంత్, చందు, సుధాకర్‌లు కలసి స్థానిక వినాయక మండపానికి కూతవేటు దూరంలో మద్యం తాగారు. అప్పటికే వారందరూ కలసి గంజాయి తీసుకున్నారు. ఈ మత్తులో పాత కక్షలు గుర్తుకొచ్చి గొడవపడ్డారు. ఈ క్రమంలో తన వద్ద వున్న కత్తితో అశోక్ వారి ముగ్గురిపై దాడిచేశాడు. ఈ దాడిలో అతడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రెచ్చిపోయిన ఆ ముగ్గురు అశోక్‌ను వెంబడించి కత్తులు, రాడ్లతో దాడిచేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన చందు(22)ను చికిత్స నిమిత్తం రుయాకు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్‌ఐ హేమాద్రి చెప్పారు. అనంతరం నెత్తుటి గాయాలతో పడివున్న హేమంత్, అశోక్, సుధాకర్‌లను చికిత్స నిమిత్తం స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. వీరిలో అశోక్ పరిస్థితి విషమంగా వున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ సమాచారం అందుకున్న ఈస్ట్ సీఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. రుయాలో చికిత్స పొందుతున్న వారిని విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ ఘటనకు కారణం ఆటోడ్రైవర్ అశోక్‌గా పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

గూడూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన బాలికను తల్లిదండ్రులకు శనివారం రెండో పట్టణ పోలీసులు అప్పగించారు. స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన బాలిక మనస్థాపంతో శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సమీప బంధువుల ఇళ్ల వద్ద గాలించినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి సాధుపేట సెంటర్‌లో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

శాశ్వత మరమ్మతులకు నిరీక్షణ



కుంగిన పెద్దచెరువు కట్ట

పాకాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సామిరెడ్డి పల్లె సమీపంలోని పాకాల పెద్దచెరువుకు నేటికీ శాశ్వత మరమ్మతులు చేపట్టలేదు. 2021 అక్టోబరులో భారీ వర్షాలకు కట్టమధ్యలో 50 అడుగుల మేర కుంగిపోయి తెగిపోయే పరిస్థితి నెలకొంది. అప్పట్లో చెరువు కట్ట తెగిపోకుండా మొరవ తెగ్గొట్టి నీటిని వదిలేయడంతో తాత్కాలికంగా ముప్పు తప్పింది. కట్టకు తాత్కాలికంగా మట్టితో మరమ్మతులు చేశారు. కట్టకుంగుతున్న ప్రదేశంలో ఇసుక మూటలను పేర్చారు. శాశ్వత మరమ్మతులు మాత్రం చేపట్టలేదు. సుమారు 157 ఎకరాల్లో విస్తరించిన చెరువు కట్ట సుమారు రెండు కిలోమీటర్లకు పైగా ఉంటుంది. కట్ట తెగిపోతే పాకాల, పూతలపట్టు మండలాల పరిధిలోని పలు గ్రామాలకు నష్టం వాటిల్లుతుంది. పలు చెరువులు తెగిపోయే పరిస్థితులున్నాయి. పంటనష్టంతో పాటు ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. కట్ట రెండు వైపులా ముళ్ల కంపలు, చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో ఎక్కడ కట్ట బలహీనంగా ఉందో తెలుసుకునే పరిస్థితి లేదు. శాశ్వత మరమ్మతులు చేసి, తెగొట్టిన మొరవను మళ్లీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ చెరువులో నీళ్లుంటే పరిసర గ్రామాలకు సాగు, తాగునీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు చెబుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని చెరువు మొరవ

మంగళం ట్రెండ్స్‌లో నూతన క్రీడా వేదికలు



బాస్కెట్‌బాల్ క్రీడా వేదిక

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం మంగళం ట్రెండ్స్ ఉన్నతపాఠశాలలో మూడు నూతన క్రీడా వేదికలు ఏర్పాటవుతున్నాయి. విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యార్థం పీఎంశ్రీ పథకం ద్వారా దాదాపు రూ.5లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో పాఠశాల ఆవరణంలో ఉన్న విశాలమైన మైదానంలో రెండు క్రీడాంశాలకు సంబంధించిన వేదికలను ఎంపిక చేశారు. 13.4మీటర్ల పొడవు, 6.1మీటర్ల వెడల్పు బ్యాడ్మింటన్ కోర్టు, 28మీటర్ల పొడవు, 15మీటర్ల వెడల్పుతో బాస్కెట్‌బాల్ కోర్టులు నిర్మితమవుతున్నాయి. దీంతోపాటు లాంగ్‌జంప్, హైజంప్, త్రిపుల్‌జంప్, పోల్‌వాల్ట్ వేదికను కూడా సిద్ధం చేస్తున్నారు. మూడు రోజులుగా ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో పదిరోజుల్లో పూర్తికానున్నాయి. రంగులు, ఫోల్స్ వంటి అదనపు ఏర్పాట్లను కూడా త్వరగా పూరి చేసి విద్యార్థినీ విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని పీఈటీ సాంబశివరావు తెలిపారు.



బ్యాడ్మింటన్, జంప్ క్రీడావేదికలు

నగర భవిష్యత్ అవసరాలు, ప్రణాళికపై పరిశోధన



ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ స్కూల్ విద్యార్థులు, ప్రొఫెసర్లు

ఏర్పేడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో శనివారం నీతి బోధ్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌తో కలిసి 'అర్బన్ ఫ్యూచర్స్ - ప్లానింగ్ అండ్ పాలసీ కనెక్ట్ కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ ఏకతతో పాటు 33 మంది ఎస్‌పీఏ విద్యార్థులు హాజరయ్యారు. సస్టైయినబుల్ అర్బన్ ప్లానింగ్‌పై ఆమె కీలక ప్రసంగం చేశారు. అనంతరం విద్యార్థులు తిరుపతి నగర భవిష్యత్తు, అభివృద్ధిపై తమ పరిశోధనను వివరించారు. 2040 నాటికి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి స్థలం తక్కువై అర్బన్ స్ప్రాల్ పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. తిరుపతి ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా యాత్రిక, పర్యాటకంపై ఆధారపడి ఉందని, వ్యవసాయం, పరిశ్రమలు కూడా ప్రధానపాత్ర వహిస్తున్నాయని తెలిపారు. ఈ విశ్లేషణకు శాటిలైట్ చిత్రాలు, ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్, మెషిన్ లెర్నింగ్ వినియోగించారు.

ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వరుణ్ వర్గీస్ ఢిల్లీ మెట్రో ఆధారంగా ఆటోమేటిడ్ ఫేర్ కలెక్షన్ ద్వారా రద్దీ కొలతలపై ప్రసంగించారు. డాక్టర్ అర్వింద్ పాండే మున్సిపల్ ఫైనాన్స్ - సవాళ్లు, అవకాశాలపై మాట్లాడారు. తరువాత ఘన వ్యర్థాల నిర్వహణపై రౌండ్ టేబుల్ చర్చ జరిగింది. విద్యార్థులు పౌర సమాజం, సాంకేతిక వర్గం, ప్రభుత్వం, పర్యావరణ విధాన నిపుణులు, అర్బన్ ప్లానర్లు తరపున ఐదు బృందాలుగా ఏర్పడి పరిష్కారాలు సూచించారు. భవిష్యత్తులో ఎస్‌పీఏ విజయవాడతో మరిన్ని సంయుక్త కార్యక్రమాలు చేస్తామని నీతిబోద్ ప్రకటించింది.

డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళన



డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఇసకపాలెం, కొణ్ణంబట్టు గ్రామాల ప్రజలు

సూళ్లూరుపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును తమ గ్రామాల సమీపంలో ఏర్పాటే చేయొద్దంటూ వదయ్యపాలెం మండలంలోని ఇసకపాలెం, కొణ్ణంబట్టు గ్రామస్తులు శనివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 13-1 లో 10 ఎకరాల భూమిని ఇటీవల డంపింగ్ యార్డుకు కేటాయించారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ సంబంధిత పత్రాలు అప్పగించారు. దీంతో మున్సిపాలిటీలో సేకరించిన చెత్త, వ్యర్థాలతో ట్రాక్టర్లు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వద్దకు వెళ్లాయి. ఇంతలో సమీప గ్రామస్తులు అక్కడకు చేరుకుని చెత్త ట్రాక్టర్లను అడ్డగించారు. ఇక్కడ చెత్త వేసేందుకు వీల్లేదంటూ రోడ్కెక్కి ఆందోళన చేపట్టారు.విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య అక్కడకు చేరుకుని గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, దంపియంగ్ యార్డు వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

గూడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబరు 13వ తేదీన మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి బీవీ.సులోచనారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని, దీనివల్ల ఖర్చులు, సమయం ఆదా అవుతాయన్నారు. లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించండి



డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం ఇస్తున్న వందవాసి నాగరాజు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కూలి బకాయిలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధికారులను కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులను కలిసి వినతిప్రతం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న వేలాదిమంది ఉపాధి కూలీలకు సుమారు మూడు నెలలుగా కూలి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని మూడు వారాలకు మించకుండా వారికి బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.25లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన గుమ్మడి అన్వేష్ శనివారం రూ.25లక్షలను విరాళంగా ఇచ్చారు. అన్నదానం ప్రారంభించినప్పటి నుంచి ఈ స్థాయిలో విరాళం అందడం ఆలయానికి ఇదే ప్రథమం. కాగా ఏపీ ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ వరసిద్ధుడిని శనివారం దర్శించుకున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



సుమతి (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వివాహిత మృతి చెందింది. ఏఎస్‌ఐ గోవిందస్వామి తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో నివాసం ఉంటున్న సుమతి(39) శనివారం ఉదయం లైట్ వేయడానికి స్విచ్ ఆన్ చేసింది. లైట్ వెలగకపోవడంతో వైర్లను కదిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబీకులు ఆమెను వెంటనే కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.



పరమసముద్రం చెరువు ఒడ్డుపై చంద్రబాబు నడక







ఎంవోయూ పత్రాలతో చంద్రబాబు, ఏజీఎస్ - ఐటీసీ సంస్థ ప్రతినిధులు - చంద్రబాబుకు ఆశీర్వచనాలు

ఆరు కంపెనీలతో కడ ఎంవోయూలు

శాంతిపురం/గుడుపల్లె/కుప్పం రూరల్,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు తన కుప్పం పర్యటనలో కడా ద్వారా ఆరు కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. కుప్పం పరిధిలో చెత్తనుంచి సంపద తయారు చేసేందుకు ఏజీఎస్(అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్) ఐటీసీ, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు షీలీడ్స్, ఫైబర్ బోర్డు ఉత్పత్తికోసం కింగ్స్ వుడ్ డెకార్ ప్రైవేట్ లిమిటెడ్, 2 సీటర్ ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్, మీడియం లిఫ్ట్ లాంచింగ్ రాకెట్ రేజర్ క్రెస్ట్ ఎంకే-1 తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం స్పేస్ టెక్నాలజీ సంస్థ ఎత్రెయాల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిక్స్ కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి.మొత్తం ఈ సంవత్సర కాలంలో రూ.3920 కోట్ల పెట్టుబడితో 12 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ప్రత్యక్షంగా 15600 మందికి, పరోక్షంగా 26,500 మందికి ఉద్యోగ, ఉపాధి లభించనుంది.

కుప్పంలో ఐ ఫోన్ ఛాసిస్ తయారీ కేంద్రం

కుప్పంలో హిందాల్కో అంతర్జాతీయ కంపెనీ రూ.587 కోట్ల పెట్టుబడితో ఐ ఫోన్ ఛాసిస్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీని ద్వారా కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.



లబ్ధిదారులతో బస్సు ప్రయాణం

స్వగృహం నుంచి సభా ప్రాంగణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. వివిధ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆయనీ ప్రయాణం చేశారు. వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించడమే కాక, వారు పొందుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. రైతులతో హంద్రీ-నీవా నది ద్వారా తరలివచ్చిన కృష్ణమ్మ గురించి అడిగినప్పుడు వారి మాటల్లో, ముఖంలో కనిపించిన ఆనందం చూసి ఆయన ఉత్తేజితులయ్యారు.

క్రేజీ బాయ్స్ యూత్ అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా శనివారం సుందరయ్యనగర్‌లో క్రేజీ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు. గత 20 ఏళ్లనుంచి క్రేజీ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అదేవిధంగా 35వ డివిజన్లలోనూ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధికారప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, 44, 35వ డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్, ఎస్వీఎం శ్రీధర్, నాయకులు రవితేజ, వాణి, జయంతి, మల్లికార్జున్, వెంకటముని, ఉదయ్, విగ్నేష్ పాల్గొన్నారు.

● 36వ డివిజన్‌లో...

స్థానిక 36వ డివిజన్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిత్తూరు రవిశంకర్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, జనసేన డివిజన్ అధ్యక్షుడు వినోద్ రాయల్, మధు యాదవ్, కృష్ణ యాదవ్, టీడీపీ మహిళా నాయకురాలు విజయలక్ష్మి, తిరుపతి బీసీసంక్షేమ సంఘ నాయకుడు శేషాద్రి మొదలియార్ పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో వైవీబీ



తిరుపతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక 34వ డివిజన్ రైల్వే కాలనీలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వినాయక విగ్రహానికి పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ధనుంజయులు యాదవ్, మునిశేఖర్, సురేష్, జంగం ముని సుబ్రహ్మణ్యం, నైనార్ జగదీష్, సురేంద్ర రాజు, శేఖర్, గుండాల గోపీనాథ్ రెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్ పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించండి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు చెత్త తరలించే వాహనాల్లో మైకుల ద్వారా అవగాహన కల్పించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు సూచించారు. శనివారం నగరంలోని పరదాల వీధి, రామచంద్ర పుష్కరిణి, జ్యోతి థియేటర్ కూడలి, నెహ్రూ నగర్, కావమ్ గుడి వీధి, ఐఎస్ మహల్, ఉర్దూ స్కూల్ వీధి, బ్రహ్మంగారి గుడి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్ కల్పన, అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వీధికి చెత్త సేకరణకు వెళ్ళే వాహనాల్లో మైకుల ద్వారా చెత్త వేరు చేసి ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. నైట్ షెల్టర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీఈలు మధు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

ఇంటర్‌స్కూల్స్ ఫెస్ట్ సమాచార పత్రిక ఆవిష్కరణ


సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న త్యాగరాజన్, విశ్వచందన్‌రెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో యూఎస్‌వో ఇంటర్‌స్కూల్స్ ఫెస్ట్ - 2కె25 సమాచార పత్రికను శనివారం ఆవిష్కరించారు. స్కూల్ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డితో యూఎస్‌వో వైస్‌ప్రెసిడెంట్ కేవీ త్యాగరాజన్ కలసి విడుదల చేశారు. ఈసందర్భంగా త్యాగరాజన్ మాట్లాడుతూ.. జీవకోనలోని విశ్వంస్కూల్ వేదికగా 6-10తరగతుల విద్యార్థులకు సెప్టెంబరు 22న ఈఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. చిత్రలేఖనం, వక్తృత్వ, జానపద, నృత్య, నాటక, విజ్ఞాన ప్రదర్శన అంశాల్లో పోటీలు ఉంటాయని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విశ్వచందన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభని ప్రదర్శించేందుకు చక్కని వేదికగా నిలుస్తుందన్నారు. ఇతర సమాచారంకోసం 8688888802/03, 7093473533 ఫోన్‌నెంబర్లని సంప్రదించాలని కోరారు. యూఎస్‌వో సభ్యులు డాక్టర్ టి.శ్రీనాథశర్మ, ఎం.వెంకటరమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా బోధిని పుస్తకాల పంపిణీ


విద్యార్థులతో హెచ్‌ఎం మురుగన్, పక్కన డాక్టర్ సుగుణలత, టీచర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక టీపీపీఎం హైస్కూల్‌లో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రతిభా బోధిని పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. పాఠశాలలో ఇంగ్లీషు టీచర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుగుణలత తల్లిదండ్రులు బాలమ్మ, వెంకటస్వామి దంపతులు రచించిన ఈపుస్తకాన్ని విద్యార్థులకు అందజేశారు. సుగుణలత మాట్లాడుతూ.. సరళపద్ధతిలో తెలుగుభాష అధ్యయనం, బోధించాలనే ఆసక్తి ఉన్నవారికి ఈపుస్తకాన్ని అందిస్తున్నామని, దీనిలో భాగంగా బాల తెలుగు ఉపాధ్యాయ విద్యార్థులుగా కొందరిని ఎంపిక చేసి అందించామని తెలిపారు. హెచ్‌ఎం ఎ.మురుగన్, టీచర్లు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర భారతదేశానికి దోచి పెడుతున్న కేంద్రం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతదేశానికి దోచిపెడుతోందని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీసభ్యురాలు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలో పన్నుల రూపంలో వసూలుచేసి ఉత్తర భారతదేశానికి అత్యధికంగా దోచిపెడుతోందన్నారు. 2018 నుంచి దీనిపై పోరాటం జరుగుతూనే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉత్తర భారతదేశానికి చెందిన వారు నాటుకుపోవడంతో మన పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రజలు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జంగాలపల్లి శుభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

నవంబర్‌లోపు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి కావాలి

● ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్ష

తిరుపతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నవంబరులోపు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ మిషన్ ద్వారా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై శనివారం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సెప్టెంబర్ చివరిలోపు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తికావాలని సంబంధిత ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ రెండవ వారంలో లైవ్ ప్రారంభం కావాలని, నవంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎస్ఈ శ్యాంసుందర్, ఈఈ రవి, డీఈ రాజు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీమేయర్ ముద్ర నారాయణ 14వ డివిజన్ ఎస్టీవీ నగర్‌లో శనివారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయడం శుభపరిణామన్నారు. తన డివిజన్లో 1036 కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో జనసేన ఇంచార్జి రమేష్ రెడ్డి, టీడీపీ నేత జస్వంత్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధికి స్వాగతం


మధుసూదన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్‌కు బీజేపీ నాయకులు శనివారం ఘన స్వాగతం పలికారు. పార్టీ పదవి స్వీకరించాక మొదటిసారిగా వచ్చిన ఆయనకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో స్థానిక బీజేపీ నాయకులు గజమాల, దుశ్శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు గుండా గోపీనాథ్‌రెడ్డి, కట్టమంచి చంద్రబాబుయాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డిని మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిలోని సంఘం కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. తొలుత ఇప్పటి వరకు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి అధ్యక్షులు వివరించారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీపై జరిగిన చర్చలో మరోమారు ప్రభాకర్‌రెడ్డిని అధ్యక్షుడిగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్.వేణుగోపాల్, కోశాధికారి టి.దాసు, జి.గోవిందరెడ్డి, చిన్నంగారి రమణ, జి.సుబ్రమణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా ఉందాం


మాట్లాడుతున్న వైసీపీ మహిళా అధ్యక్షురాలు కల్యాణి

తిరుపతి(జీవకోన), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జగనన్నకు అందరం అండగా నిలబడి, సీఎంను చేసేంత వరకు అవిశ్రాంతంగా పనిచేయాలని వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్యాణి పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి సమీపంలోని భూమన నివాసం వద్ద నియోజకవర్గ మహిళ నాయకురాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజితారెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, అభినయ్, రవిచంద్రారెడ్డి, గౌరి, జిల్లా అధ్యక్షురాలు మాధవి, గీత యాదవ్, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

4న ఎస్వీయూలో టీచర్స్‌డే సంబరాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీచర్స్ డే సంబరాలు సెప్టెంబరు 4వ తేదీన ఎస్వీయూనివర్సిటీలో నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు పాల్గొంటారు.

బస్టాండు టాయిలెట్ల వద్ద రుసుం బాదుడు




సీబీఎస్‌లోని వెంకటగిరి, కాణిపాకం ప్లాట్‌ఫాంల వద్ద వున్న మరుగుదొడ్లు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ బస్టాండులోని మరుగుదొడ్ల వద్ద అధిక రుసుం వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. నిర్వహణకు కొంత మొత్తం వసూలు చేయడం అవసరమే అయినా మరీ ఎక్కువ తీసుకోవడం సబబుకాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్త్రీశక్తి పథకానికి ఒకపక్క సానుకూల స్పందన వస్తుండగా వసతుల కల్పనలో ఇలాంటి బాదుడేంటని ప్రశ్నిస్తున్నారు. రోజువారీగా మహిళా ప్రయాణీకులకు భరించే మొత్తంలో ఒక్కశాతం అదనంగా భావిస్తే మరుగుదొడ్ల నిర్వహణ కూడా ఫ్రీ అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రూ.3, రూ.5 వసూలు చేయాలని ఆర్టీసీ నిబంధనలు పెట్టినా మరుగుదొడ్ల కాంట్రాక్టర్ రూ.10, రూ.20 అనధికారంగా వసూలు చేస్తున్నారని వీరు ఆరోపిస్తున్నారు. ప్రవేశద్వారాల వద్ద ఆర్టీసీ పెట్టిన రుసుం మాత్రమే వసూలుచేయాలని బోర్డులున్నా వాటిని కాంట్రాక్టర్ అమలు చేయడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండులలో ఫ్రీ టాయిలెట్ సౌకర్యం కల్పించాలని అన్ని వర్గాల ప్రయాణీకులు కోరుతున్నారు.

ఉన్న కాసింత నగదు కూడా అయిపోయింది



గూడూరు నుంచి అక్క, చెల్లితో తిరుపతి వచ్చాను. ఆస్పత్రిలో చికిత్స తీసుకొని మళ్లీ ఉచితంగా ఇల్లు చేరుతున్నాం. కాని మరుగుదొడ్లకోసం వారడిగినంత నగదు చెల్లించాం. ఉన్న కాసింత నగదు కూడా అయిపోయింది. ప్రభుత్వం కల్పించుకొని మరుగుదొడ్ల సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పించాలి.

- వెంకటమ్మ, గూడూరు

తక్షణమే ఫ్రీ టాయిలెట్‌గా ప్రకటించాలి



శ్రీవారి దర్శనార్థం వచ్చాం. తిరుపతి వరకు రాను పోను ఉచితంగానే ప్రయాణం. ఇందు కోసం ప్రభుత్వం వేలకోట్లరూపాయలు ఖర్చుపెడుతోంది. ఖర్చులో ఖర్చుగా భావించి తక్షణమే ఫ్రీ టాయిలెట్ ప్రకటించాలి. అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరువస్తుంది.

- కుమారిదేవి, రాజమండ్రి

ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

● కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్


అవగాహన ర్యాలీలో పాల్గొన్న వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఐదో రోజు ఆదివారం జరుగనున్న సామూహిక నిమజ్జన కార్యక్రమంపై తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని శనివారం నగరంలో నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ సామూహిక నిమజ్జన మహోత్సవానికి ఐదు మార్గాల గుండా ఊరేగింపుగా బయలుదేరి లీలామహల్ మీదుగా పాతమద్దిమానుల సమీపంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద హారతులు అందుకున్న అనంతరం వినాయక సాగర్‌కు చేరుకోవాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఉత్సవకమిటీ సంయుక్తంగా రూపొందించిన రూట్ మ్యాప్‌ను అనుసరించి అందరూ నిమజ్జనం పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. ర్యాలీలో భాగంగా మండప నిర్వాహకులను కలిసి నిమజ్జన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ ఉత్సవ కమిటీ కార్యాలయం నుంచి ప్రారంభమై టీఎంఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం సర్కిల్, ఎంఆర్‌పల్లి, బాలాజీకాలనీ, మహతి ఆడిటోరియం, ఎల్‌బీసీ రోడ్డు, భవాని నగర్, పాత మున్సిపల్ కార్యాలయం మీదుగా సాగింది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, సభ్యులు గుండాల గోపీనాథ్, కరాటే శ్రీనివాస్, ఎస్‌వీఎం వెంకటేష్, హేమకిరణ్, భాస్కర్‌నాయుడు, నవీన్, జీవన్‌రాయల్, పార్థు, దీపక్, దీన, వాసు, చెంగారెడ్డి, ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వరప్రసాద్, నాగేశ్వరరావు, అనిల్‌రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడే నిమజ్జన కార్యక్రమం

చవితి పండుగను పురస్కరించుకుని ఆదివారం సామూహిక నిమజ్జన కార్యక్రమం స్థానిక వినాయకసాగర్‌లో జరుగనుంది. ఇందుకోసం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పోలీసుశాఖ, ఇతర శాఖలు సంయుక్తంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. నిమజ్జన కార్యక్రమానికి తిరుపతి నగర పరిధితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా సాగర్‌కు పెద్దఎత్తున విగ్రహాలు తరలి రానున్నాయి.

నెహ్రూనగర్‌లో అన్నదానం


అన్నదానం చేస్తున్న పులుగోరు మురళీ, జేబీ శ్రీనివాస్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి నెహ్రూనగర్‌లో శనివారం యూత్ ఫైవ్ స్టార్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు జేబీ శ్రీనివాస్‌లు పూజల్లో పాల్గొన్నారు. చవితి ఉత్సవాల సందర్భంగా దాదాపు 2వేల మందికి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు శరత్ చౌదరి, విజయకుమార్, రఘు, మహబూబ్ బాషా, సుధాకర రెడ్డి, ప్రసాద్, వంశీ, సూరి, విజయ్, జగ్గా పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూసమస్యను పరిష్కరించాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లిలో భూసమస్యను పరిష్కరించి బాధితులకు పాట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు కోరారు. శనివారం ఈమేరకు వేమన విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కరించుకోవాలంటే పోరాటాలకు సిద్ధం కావాలని బాధితులకు పిలుపునిచ్చారు. ప్రజలను చైతన్యపరచడానికి కరపత్రాలను పంపిణీ చేయాలన్నారు. వేణు, సుబ్రమణ్యం, మాదవ్, బుజ్జి, రమేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


చాందిని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకులు ఎం.చాందిని డాక్టరేట్ పొందారు. యాన్ ఇంటెలిజెంట్ టూరిజం ఇన్ఫర్మేషన్ సిస్టం అనే అంశంపై ప్రొఫెసర్ జాస్తి కాత్యాయని పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. ఈ మేరకు పద్మావతి వర్సిటీ పీఆర్వో డాక్టర్ ఎన్.శ్రీరజని తెలిపారు.

ఆర్టీసీలో ఐదుగురు ఉద్యోగుల పదవీ విరమణ

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో జిల్లా వ్యాప్తంగా శనివారం ఐదుగురు ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. గూడూరు డిపోకు చెందిన కండక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మెకానిక్ పి.సిద్దమ్మ, వాకాడు డిపోకు చెందిన కండక్టర్ టి.వి.సుబ్బయ్య, తిరుపతి డిపోకు చెందిన డ్రైవర్ జి.పురంధర నాయుడు, తిరుమల డిపోకు చెందిన కంట్రోలర్ ఎస్.కేశవులరెడ్డి దాదాపు పాతికేళ్ల నుంచి 38ఏళ్లుగా ఆర్టీసీలో పనిచేస్తూ ప్రయాణీకులకు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయా డిపోలలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించి, సహచరులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

ఊరట కలిగించిన వాన

తిరుపతి అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఎండలతో అల్లాడుతున్న నగర ప్రజలకు శనివారం రాత్రి ఉపశమనం కలిగింది. అనూహ్యంగా కురిసిన వాన ఆనందాన్ని పంచింది. రాత్రి 7.30 గంటల నుంచి దాదాపు రెండు గంటలపాటు వర్షం కురిసింది. షాపుల్లో, రోడ్లపై, బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో సంచరిస్తున్న ప్రజలు తడిసిముద్దయ్యారు. ఇళ్లకు చేరుకోడానికి అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. రైల్వే అండర్ బ్రిడ్జీల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. వినాయక మండపాల వద్ద ఏర్పాటుచేసిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు రద్దయ్యాయి. కాగా వాతావరణం చల్లబడడంతో ప్రజలంతా ఊరట చెందారు.

భక్తిపారవశ్యం.. నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర తిరుమాడవీధుల్లో శనివారం జరిగిన నగర సంకీర్తన భక్తిపారవశ్యం చాటింది. గోవింద నామాలను స్మరిస్తూ భజన కళాకారులు ఈ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చెంగారెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, మురళి, మునిరత్నమాచారి, పద్మావతి, కళ్యాణి, సిద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి సినిమాల్లో కొరవడిన సాహిత్యం

● యూనియన్ బ్యాంకు డీజీఎం సూర్యప్రకాష్‌రావు



బాపు, విశ్వనాథ్‌ల చిత్రాల్లోని పాటలను ఆలపిస్తున్న గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, జయరాం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నేటి సినిమాల్లో సాహిత్యం, సంస్కృతి కొరవడిందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం సూర్యప్రకాష్‌రావు అన్నారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శృతిలయలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వనాథ్, బాపులాంటి దర్శకుల చిత్రాల్లో నవరసాలతోపాటు సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాల గురించి కళ్లకు కట్టినట్లు చూపించేవారని తెలిపారు. ఇలాంటి సినిమాలు నేటి యువతకు చాలా అవసరమని చెప్పారు. ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ పీసీ రాయులు మాట్లాడుతూ సంగీతానికి, సాహిత్యానికి బాపు, విశ్వనాథ్ పెద్దపీట వేశారని చెప్పారు. జి.శాంతావాణి, గుల్జార్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షులు వైఎస్‌బాబు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి యు.ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు, అనసూయ, మధుసూదన్‌రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, జయరాంలు ఆలపించిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. వీరు శంకరా... నాదశరీరా పరా.. వేదవిహారా హరా.. జీవేశ్వరా శంకరా.., సంగీత సాహిత్య సమలంకృతే.. స్వరరాగ పదయోగ సభభూషితే.. హే భారతీ.. మనసా స్మరామి..., వేదం అనువణువున నాదం నా పంచప్రాణాల నాట్య వినోదం నాలో రేగే ఎన్నో హంసానందిరాగాలే.. అంటూ పలు గీతాలను ఆలపించి ఉర్రూతలూగించారు.







తిరుపతిలోని ఎమ్మార్‌పల్లె : తులాభారం వినాయకుడు - వేషాలమ్మ ఆలయం వద్ద : ఐదు తలల పాముపై.. - అరవపల్లెవీధి : పండ్ల చెట్టుపై ఊగుతున్న వినాయకుడు - నిమ్మకాయల వీధి : బ్రహ్మ రూపంలో.. - పరసాలవీధి : నంది వాహనంపై..

‘కిక్’ ఇవ్వని దరఖాస్తులు

● జిల్లాలో ఆరు బార్లకు నిల్

● ముగిసిన లైసెన్స్‌ల లాటరీ ప్రక్రియ


బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్


తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన బార్ల లైసెన్స్ లాటరీ విధానం పారదర్శకంగా ముగిసింది. తిరుపతి మినహా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు. దరఖాస్తుల గడువు పొడిగించినా సరైన స్పందన లేదు. ఈ ప్రభావం ఎక్సయిజ్ ఆదాయంపై పడుతుందని భావిస్తున్నారు. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ లాటరీ తీసి, దరఖాస్తుదారులకు లైసెన్స్‌లు కేటాయించారు. మొత్తం 29 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా 23కు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇందులో తిరుపతి నగరంలో అత్యధికంగా 17 బార్లకు గాను 149 దరఖాస్తులు వచ్చాయి. పరిశీలించిన అధికారులు అత్యధికంగా టెండర్ కోడ్ చేసిన 17 మందికి లాటరీ పద్ధతిలో కేటాయిస్తూ లైసెన్సులు జారీ చేశారు. చంద్రగిరి, పుత్తూరులో రెండు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. నాయుడుపేట పరిధిలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు అందాయి. గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను ఒక దానికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. సూళ్లూరుపేటలో రెండు బార్లు, వెంకటగిరిలో ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. మొత్తంగా 23 బార్లకు దరఖాస్తులు అందగా ఒక్కో దరఖాస్తు రుసుం రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10వేలు చెల్లించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.8.82 కోట్లు ఆదాయం వచ్చింది. ఇక రిజర్వేషన్ కేటగిరీ కింద గీత కార్మికుల కోసం కేటాయించిన తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను 36 దరఖాస్తులు అందాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.1.83 కోట్లు ఆదాయం లభించింది. దీంతో పాటు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో అదనంగా మరో రూ 2.30 కోట్లు ఖజానాకు ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏసీ శ్రీనివాసులు, ఏఈఎస్ వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌తో నటుడు సాయికుమార్ భేటీ



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సాయికుమార్ శనివారం టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం ఆయన కుమారుడు ఆదితో కలిసి తిరుమలకు వచ్చారు. సాయంత్రం చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ నాయుడిని కలిసి వివిధ అంశాలపై ముచ్చటించారు.

వానాకాలం జ్వరాలతో జాగ్రత్త!



జిల్లా వైద్యాధికారి అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్




తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

అడపాదడపా ఆగకుండా కురుస్తున్న వానలు జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి. వానలకు చెట్టూచేమా పెరిగి పరిసరాలు గుబురుగా మారుతున్నాయి. చిన్న గుంటల్లోనూ నీరు చేరి దోమలు వ్యాపిస్తున్నాయి. సీజనల్‌గా వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటివి పెరుగుతున్నాయి. జలుబు, దగ్గు, తలనొప్పితో ఇబ్బంది పడేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిరోధానికి ప్రభుత్వ సన్నద్ధత గురించి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ఆంధ్రజ్యోతి సంభాషణ...

ప్రశ్న : ఈ వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : నీరు నిలిచే, దోమలు ఉండే ప్రదేశాలను గుర్తించాం. శుభ్రం చేయిస్తున్నాం. తాగునీటి బావులు, బోర్లు, కుళాయిల వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నాం. ఎక్కడైనా ఒకటి రెండు జ్వరం కేసులు రాగానే వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పరిసరాల శుభ్రత, దోమల విజృంభణపై గ్రామాల్లో సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

ప్రశ్న: మందులకు, నిధులకు, వైద్యులు, ఇతర సిబ్బందికి కొరత ఉందా?

జవాబు : సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే రూ.1.75 లక్షలతో మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు పీహెచ్‌సీలకు కల్పించాం. మరీ ఇబ్బంది ఉంటే జిల్లా కార్యాలయంలోని ఎపిడమిక్ విభాగమే వైద్యశిబిరాలను నిర్వహిస్తుంది. వైద్యుల, సిబ్బంది కొరత లేదు.

ప్రశ్న: ఎలాంటి వైద్య సేవలను అందిస్తున్నారు?

జవాబు : జిల్లాలో 26 యూపీహెచ్‌సీలు, 58 పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 70కి పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. 160కి పైగా రకాల మందులను ఉచితంగా అందిస్తున్నాం. గ్రామీణ పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలందించేలా అప్రమత్తం చేశాం. సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు, వైద్య సేవలు ఇక్కడే అందేలా చర్యలు తీసుకున్నాం. అత్యవసరమైతే ప్రాంతీయ, ఏరియా ఆస్పత్రులకు లేదా రుయాస్పత్రికి బాధితులను తీసుకువచ్చి వైద్యం అందిస్తునాం.

ప్రశ్న: పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక చర్యలు?

జవాబు: వర్షాకాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడే ది పిల్లలు, వృద్ధులూ. వీరి ఆరోగ్య భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శిస్తున్నారు. జలుబు, దగ్గు వంటి చిన్నపాటి లక్షణాలున్నా వైద్య సహాయం అందిస్తున్నారు. ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, చలిని తట్టుకునే దుస్తులను ధరించాలని సూచిస్తున్నాం వృద్ధులు మరీ అవసరమైతే తప్ప ఈ సీజన్‌లో బయటకు రాకపోవడం మంచిది.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

జవాబు : వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తాయి. దోమ తెరలు వాడాలి. దోమల నివారణకు మార్కెట్లలో అమ్మే రసాయనాలతో మరింత జబ్బుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడమే శ్రేయస్కరం. చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా వంటి బాధితులు చిన్నపాటి అనారోగ్యలక్షణాలున్నా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.39 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,717

తలనీలాలు సమర్పించినవారు: 22,445

శ్రీవారిని దర్శించుకున్న బుద్ధ సర్క్యూట్ యాత్ర సభ్యులు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని ‘త్రిసేనల బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర’ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. బుద్ధుడి సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వాలను దేశమంతా వ్యాప్తిచేయాలనే లక్ష్యంతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో కూడిన బృందం మోటరు సైకిల్ యాత్రగా శుక్రవారం తిరుపతికి చేరుకున్న విషయం తెలిసిందే. వీరి బృందం శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులు సమావేశమయ్యారు. చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయని, ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలను సర్దుబాటు చేయాలని టీడీపీ మహిళా నాయకురాలు సుధారెడ్డి కోరారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు సంబంధించిన వివిధ సమస్యలను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నేతలు వరప్రసాద్, నాగార్జున, కలిందర్, చంద్రమోహన్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, శ్రీకాళహస్తి ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టుల నియామకం

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరు, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జనరల్ సర్జరీ)గా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.వెకంటాచలపతి సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై గూడూరు ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అలాగే గూడూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పీడియాట్రిక్స్)గా పనిచేస్తున్న డాక్టర్ బి.గిరిజ సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

తిరుపతి నుంచీ ఇద్దరికి బదిలీ... ఇక్కడికి ముగ్గురి రాక

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ మెకడికల్ కళాశాలల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురికి ప్రభుత్వం ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించింది. అందులో భాగంగా తిరుపతి ఎస్వీ ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచీ ఇద్దరు పదోన్నతిపై ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా ఇతర ప్రాంతాల నుంచీ ముగ్గురు ఈ కళాశాలకు బదిలీపై రానున్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో అనస్తీషియా విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.విజయ్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, ఈఎన్‌టీ విభాగంలో అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఆర్ రాజేశ్వరి పదోన్నతిపై పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. అలాగే శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఈఎన్‌టీ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రమేష్ చంద్ర, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్కే షర్మిల, అక్కడే సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.పద్మావతి పదోన్నతిపై ప్రొఫెసర్లుగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

భవనం పైనుంచి పడి బెంగాల్ కార్మికుడి మృతి


మృతి చెందిన కార్మికుడు

రేణిగుంట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి కిందపడి పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని విప్పమానుపట్టెడ గ్రామంలో చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. విప్పమానుపట్టెడ గ్రామంలో ఓ ప్రైవేట్ కళాశాల భవనం నిర్మిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బిలాస్‌పూర్ గ్రామానికి చెందిన అన్సార్ రెహమాన్ బేల్దారి పని చేస్తూ కాలుజారి భవనం నుంచి కిందిపడిపోయాడు.అక్కడున్న సిబ్బంది చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కార్మికుడు మృతిచెందిన భవనాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి,రాధాకృష్ణ పరిశీలించారు.భవన యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారంతోపాటు మృతదేహాన్ని సొంత ఊరికి పంపించేందుకు ఖర్చులు భరించేందుకు అంగీకరింపజేశారు.

వేనాడు దర్గాలో గంధోత్సవం ప్రారంభం


దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

● పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం

తడ/సూళ్లూరుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన వేనాడు షేక్ దావూద్ షా వలీ అల్లాతాత దర్గా గంధోత్సవం శనివారం అట్టహాసంగా మొదలైంది. 630 ఏళ్ల చరిత్ర కలిగి 144 అడుగుల పొడవు కలిగిన వేనాడు దర్గా గంధోత్సవానికి నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు. మన ప్రాంతం నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పలువురు టీడీపీ నాయకులు గంథోత్సవ ప్రారంభంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేకు దర్గా నిర్వాహకులు సుదర్శన్ రావు, మజార్లు స్వాగతం పలికి, ఆశీర్వచనం చేశారు. దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో విరాజిల్లింది. ఉర్దూ ఖవ్వాలి, ఫకీర్ల విన్యాసాల నడుమ తరలివచ్చిన భక్తులు బాబా ఆశీస్సులు పొందారు. దర్గా ఆవరణలో సీసీ కెమెరాలతో పాటు ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల వరకు భక్తులతో దర్గా ప్రాంగణమంతా కిటకిటలాడింది. అర్ధరాత్రి దాటాక గ్రామ పొలిమేరలో ఉన్న పీర్లచావడి వద్ద ముస్లిం మతపెద్దలు ప్రత్యేక పూజలు చేసి, గంధాన్ని గుమటంపై గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం గంధాన్ని గ్రామ నిర్వాహకుల చేతుల మీదుగా తీసుకెళ్లి దర్గా సమాధి వద్ద లేపనం చేసినానంతరం భక్తులకు పంచిపెడతారు. గంధోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సూళ్లూరుపేట ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో 10మంది ఎస్ఐలు, ఇద్దరు సీఐలు, 120 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చూశారు.


విద్యుత్ వెలుగుల్లో దర్గా ప్రాంగణం

అధునాతన పద్ధతులతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స



● బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ మెకాలి మార్పిడి శస్త్ర చికిత్స అవసరమవుతోందని,ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా ఎలాంటి భయాందోళన లేకుండా చేసుకోవచ్చునని బర్డ్ డైరెక్టర్ గుడారు జగదీష్ అన్నారు. పుదుచ్చేరిలోని మహాత్మా గాంధీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ 24వ వార్షిక సమావేశానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారిలోనూ మోకాలి కీళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో వచ్చిన అధునాతన వైద్య పద్ధతులతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందీ లేకుండా మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. ఇటువంటి శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంలో వైద్యుడి నైపుణ్యం, ఆపరేషన్ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, నాణ్యమైన ఇంప్లాంట్లు ఎంపిక చేసుకోవడం ప్రధానమన్నారు. అనంతరం ఆయన ఆర్థోపెడిక్ రంగంలో తాజా ఆవిష్కరణలు, నూతన చికిత్స పద్ధతులు, అధునాతన శస్త్ర చికిత్సా సాంకేతికత గురించి వివరించారు. యువ వైద్యులకు ఆయన అనుభవాలను, పరిశోధనలను గురించి వివరించారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్లు, పరిశోధకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్మెంటు ముందు రోజు టీటీడీ అధికారి మృతి

● కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు?


మృతి చెందిన సుబ్బరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి కోనేటి సుబ్బరాజు(62) ఉద్యోగ విరమణకు ఒక రోజు ముందు (శనివారం) మృతిచెందారు. ఆయన సతీమణి వెంకటసరస్వతి, అలిపిరి సీఐ రాంకిశోర్‌ల కథనం మేరకు.. తిరుపతి కేటీ రోడ్డులోని కేటీ క్వార్టర్సులో ఉంటున్న సుబ్బరాజు కపిలతీర్థం ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం రిటైర్ కావాల్సి ఉంది. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సునీల్‌కుమార్ టీటీడీలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుబ్బరాజు కుటుంబ సభ్యులతో కలసి సినిమాకు వెళ్లారు. అక్కడ తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆయనను స్విమ్స్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వెంటనే కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదు. భార్య వెంకట సరస్వతి శనివారం ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ అజిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. కాగా ఈ కేసులో కొంతమంది కుటుంబ సభ్యులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయన మృతి వెనుక మరేదైనా కోణం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడి మెడపై గాయం ఉన్నట్లు పోలీసులు చెప్పినట్లు సమాచారం.

పీఏసీ5లో 2,500 మందికి వసతి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5(పీఏసీ) ద్వారా 2,500 మంది భక్తులకు బస కల్పించవచ్చని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శనివారం పీఏసీ5 భవనంలోని హాళ్లు, కల్యాణకట్ట, మరుగుదొడ్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బోర్డు ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్ట్ ద్వారా తిరుమలలో యాత్రికుల వసతి సమస్యకు కొంతమేర ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రస్తుతం తిరుమలలో 45 వేల మందికి మాత్రమే వసతి సౌకర్యాలు ఉన్నాయని, ఈ భవనం ద్వారా 2,500 మందికి అదనంగా బస లభిస్తుందని అన్నారు. వెంకయ్య చౌదరి మాట్లాడుతూ యాత్రికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ భవనంలో ఆధునిక సదుపాయాలు కల్పించామన్నారు. చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకంగా మిల్క్ ఫీడింగ్ గది ఏర్పాటు చేశామన్నారు. ఒకేసారి 1400 మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా హాలును ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో రాజేంద్ర పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సులోచనారాణి

గూడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబరు 13వ తేదీన మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి బీవీ.సులోచనారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని, దీనివల్ల ఖర్చులు, సమయం ఆదా అవుతాయన్నారు. లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళన



డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఇసకపాలెం, కొణ్ణంబట్టు గ్రామాల ప్రజలు

సూళ్లూరుపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును తమ గ్రామాల సమీపంలో ఏర్పాటే చేయొద్దంటూ వదయ్యపాలెం మండలంలోని ఇసకపాలెం, కొణ్ణంబట్టు గ్రామస్తులు శనివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 13-1 లో 10 ఎకరాల భూమిని ఇటీవల డంపింగ్ యార్డుకు కేటాయించారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ సంబంధిత పత్రాలు అప్పగించారు. దీంతో మున్సిపాలిటీలో సేకరించిన చెత్త, వ్యర్థాలతో ట్రాక్టర్లు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వద్దకు వెళ్లాయి. ఇంతలో సమీప గ్రామస్తులు అక్కడకు చేరుకుని చెత్త ట్రాక్టర్లను అడ్డగించారు. ఇక్కడ చెత్త వేసేందుకు వీల్లేదంటూ రోడ్కెక్కి ఆందోళన చేపట్టారు.విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య అక్కడకు చేరుకుని గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, డంపియంగ్ యార్డు వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు.

మధుమోహన్ సేవలు ఆదర్శనీయం



మధుమోహన్‌దాస్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు,

పెళ్లకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధమాల పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న మధుమోహన్ దాస్ ఉద్యోగ విరమణ సన్మాన సభ శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ మధుమోహన్ దాస్ అర్ధమాల పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూనే పునబాక, పుల్లూరు, కలవకూరు ఇన్‌చార్జిగా సమర్థవంతంగా వ్యవహరించి ఆదర్శనీయమైన సేవలు అందించారని అన్నారు. డీఎల్‌పీవో వెంకటరమణ, పెళ్లకూరు, నాయుడుపేట ఎంపీడీవోలు ప్రమీలాణి, సురేష్‌బాబు మాట్లాడుతూ మధుమోహన్ దాస్ పనిచేసిన ప్రతిచోటా ప్రజాప్రయోజ నాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. మధుమోహన్‌దాస్, స్వర్ణకుమారి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 మించల శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు రాయపాటి వెంకటేశ్వర్లు, నాయకులు వేలూరు హరి నాయుడు, బియ్యపు గోవిందరెడ్డి, లింగంనాయుడు, కేవీ నాయుడు, పునబాక పోలయ్య, తాళ్ల యుగంధర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, సాగి జితేంద్ర, అట్ల కృష్ణ, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినం

ఓజిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో ఎస్టీ కాలనీలో శనివారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలోపౌర హక్కుల దినం నిర్వహించారు. గిరిజనులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్‌ఐ శ్రీకాంత్, ఏవో వరప్రసాద్, ఏపీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. అధికారులు పౌరహక్కుల గురించి విద్యార్థినులు, స్థానికులకు అవగాహన కల్పించారు. చట్టాల గురించి వివరించారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించండి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కూలి బకాయిలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధికారులను కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులను కలిసి వినతిప్రతం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న వేలాదిమంది ఉపాధి కూలీలకు సుమారు మూడు నెలలుగా కూలి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని మూడు వారాలకు మించకుండా వారికి బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిపారవశ్యం.. నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర తిరుమాడవీధుల్లో శనివారం జరిగిన నగర సంకీర్తన భక్తిపారవశ్యం చాటింది. గోవింద నామాలను స్మరిస్తూ భజన కళాకారులు ఈ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చెంగారెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, మురళి, మునిరత్నమాచారి, పద్మావతి, కళ్యాణి, సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డిని మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిలోని సంఘం కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. తొలుత ఇప్పటి వరకు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి అధ్యక్షులు వివరించారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీపై జరిగిన చర్చలో మరోమారు ప్రభాకర్‌రెడ్డిని అధ్యక్షుడిగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్.వేణుగోపాల్, కోశాధికారి టి.దాసు, జి.గోవిందరెడ్డి, చిన్నంగారి రమణ, జి.సుబ్రమణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

చిట్టమూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం రొయ్యల కాలువ వంతెన వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకయ్య(22) దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు... యల్లసిరి గ్రామానికి చెందిన వెంకయ్య, ఎల్లూరు గ్రామానికి చెందిన రాఖీ బైక్‌పై మల్లాం వెళ్తుండగా వంతెనపై అదుపుతప్పి దిమ్మలను ఢీకొంది. వెంకయ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకయ్య మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

డీజే బాక్సుల స్వాధీనం

కోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు నందమూరి బసవతారక కాలనీలో శనివారం రాత్రి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక యువత డీజే సౌండ్‌తో చిందులేస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న డీజే సౌండ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు.

ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు

అడుగడుగునా నిబంధనల అతిక్రమణ

పెళ్లకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా స్వర్ణముఖినది తీర ప్రాంత వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలు అత్యధికంగా ఉన్నాయి. వీటిల్లో సగానికి పైగా బట్టీలకు ఎలాంటి అనుమతులు లేకపోగా, నిబంధనలు పాటించడంలేదు. ముఖ్యంగా వాల్టా చట్టాన్ని ఉల్లఘింస్తూ సమీపంలోని చెరువులు, అటవీ భూములు, పంట కాలువల నుంచి మట్టి, స్వర్ణ ముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వాస్తవానికి గ్రామాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలంటే పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాలి. అదేవిధంగా ఇటుకల తయారీకి మట్టి, ఇసుక కోసం రెవెన్యూ అనుమతులు ఉండాలి. ఇటుకలను కాల్చేందుకు పొల్యూషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. అలాగే బట్టీలో తయారవుతున్న ఇటుకల సంఖ్య ఆధారంగా పంచాయతీకి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా ఇటుక బట్టీల వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. అధికారులు స్పందించి అక్రమ ఇటుక బట్టీలపై దృష్టి సారించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తాళ్వాయిపాడు వద్ద జాతీయ రహదారి పక్కన ఇటుక బట్టీలు

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

గూడూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ వారికి వైద్యసేవలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యానికి సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలోనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సెంటర్, డయాలసిస్ యూనిట్ ప్రారంభించడం జరిగిందన్నారు. డయాలసిస్ యూనిట్‌లో ఏసీలు సక్రమంగా పని చేయడంలేదని తమ దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆస్పత్రిలో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

వెంకయ్య నాయుడికి సన్మానం



వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని శనివారం నాయుడుపేటకు చెందిన బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం వద్ద స్వర్ణభారత్ ట్రస్టుకు విచ్చేసిన ఆయనను బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లకాయల విజయభాస్కర్, సీనియర్ నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం, ఆరూరు సుధాకర్, రాయపాటి విద్యాసాగర్, వెంకి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించండి



మంత్రి నారాయణతో టీడీపీ నేత వెంకటేశ్వర్లు నాయుడు

గూడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలని మంత్రి నారాయణను టీడీపీ నేత నంబూరు వెంకటేశ్వర్లునాయుడు కోరారు. శనివారం నెల్లూరులోని మంత్రి నివాసంలో నారాయణను కలిశారు. హైస్కూల్‌రోడ్డులో రోడ్డు పోరంబోకు భూమిలో ప్రజాప్రయోజనాల దృష్ట్యా దాతల సహకారంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అనుమతులు ఇప్పించాలని కోరారు.

వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్



వాకాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రామయ్య నెల రోజుల క్రితం సస్పెండ్ అయ్యారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఇక్బాల్‌ను తహసీల్దారుగా నియమించారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

గూడూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన బాలికను తల్లిదండ్రులకు శనివారం రెండో పట్టణ పోలీసులు అప్పగించారు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన బాలిక మస్థాపంతో శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సమీప బంధువుల ఇళ్ల వద్ద గాలించినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి సాధుపేట సెంటర్‌లో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్ష



దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఉద్యోగులు రిలే నిరహార దీక్ష చేపట్టారు. కండక్టర్ పద్మను సస్పెన్షన్‌ను నిరసిస్తూ డిపో అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పద్మ కండక్టర్ సస్పెన్షన్ వెంటనే ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుష్పలత, గౌరి, కుసుమ, జాలమ్మ, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయండి

దక్కిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే పనులను వేగవంతం చేయాలని గూడూరు డివిజన్ సర్వే విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ పెంచలయ్యతో కలిసి రీసర్వేపై గ్రామ సర్వేయర్లకు దిశానిర్దేశం చేశారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో విలేజ్ బౌండ్రీలు, జాయింట్ ఎల్పీఎంలు, ఎఫ్ లైను, సబ్‌డివిజన్ రికార్డులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఆలయ భూముల సర్వే

సూళ్లూరుపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట పోలూరులోని ఖరేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలకు సంబంధించిన భూములను శనివారం ఈవో మమత పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. పడమటి కండ్రిగలో ఖరేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 1.26 ఎకరాలు, కోదండరామస్వామి ఆలయానికి సంబంధించి 3.43 ఎకరాలు ఉన్నట్లు గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు.

పార్శిల్ పేరిట మోసం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పార్శిల్ పేరుతో మోసం చేసిన ఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.... పట్టణంలోని బేరిపేట, సీఎస్‌తేజ సెంటర్, బజారువీధి ప్రాంతాల్లోని ముగ్గురికి శుక్రవారం పార్శిల్స్ వచ్చాయి. రూ.900 చెల్లించి తీసుకోవాలని డెలివరీ బాయ్ చెప్పాడు. తాము ఏ వస్తువూ ఆన్‌లైన్ ఆర్డర్ చెయ్యలేదని వారు తెలిపారు. ఆర్డర్ కాపీలో మీ చిరునామాలే ఉన్నాయని, అందుకే తెచ్చామని డెలివరీ బాయ్ చెప్పడంతో బాధితులు నగదు చెల్లించి పార్శిళ్లు తీసుకున్నారు. కొంతసేపటి తరువా వాటిని తెరచి చూడగా ఒక పార్సిల్ చిన్నపిల్లల పాత ప్యాంట్, మరొక దాంట్లో చిన్నపిల్లలు ఆట వస్తువు, మరో కవరులో చిన్నపాటి ప్లాస్టిక్ వస్తువులు ఉన్నాయి. మోసం చేయడానికే పార్శిళ్లు పంపారని, దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని బాధితులు చెప్పారు.

ఖరీఫ్‌లో ఎన్‌ఎల్‌ఆర్ 3648 అనువైన రకం



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

దొరవారిసత్రం. ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఎన్‌ఎల్‌ఆర్ 3648 కొత్త రకం వరి వంగడం అనువైనదని నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వినీత, శ్రీలక్ష్మి తెలిపారు. దొరవారిసత్రం మండలం లింగంపాడులో రైతు దిలీప్ సాగు చేసిన ఎన్‌ఎల్‌ఆర్ 3648 వంగడాన్ని శనివారం స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో శాస్త్రవేత్తలు పరిశీలించారు. కంకెకు ఎన్ని విత్తనాలు, విత్తనాల నిడివి పరిశీలించారు. 20నుంచి 25 దుబ్బులు, ఒక వెన్నులో 250నుంచి 300 వరకు గింజలు ఉన్నట్లు గుర్తించారు. 130 నుంచి 135 రోజులు పంట కాల పరిమితి కలిగిన ఈ వంగడం 35నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఏడీఏ కాంచన, దొరవారిసత్రం ఏవో జ్యోతిర్మయి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఎటువంటి కొరతలే కుండా యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని చెబుతున్నా, సక్రమంగా సరఫరా జరగకపోవడంతో అవస్థలు పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది డీలర్లు యూరియా కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ మండల కమిటీ ఎన్నిక

వాకాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండల వైసీపీ కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. మండల అధ్యక్షుడిగా కొండాపురం గ్రామానికి చెందిన ఏనుగు సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా పామాంజి రమణమ్మ, నల్లారెడ్డి మధుసూదనరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఏనుగు పుష్ప, ఉడతా శ్రీనివాసులు, బందిలి వెంకటయ్య, కోశాధికారికగా వాకాటి జనార్దనరెడ్డి ఎంపికయ్యారు. కార్యదర్శులుగా బండి వెంకటరత్నమ్మ, యర్రబోతు శేఖర్, చేవూరు మునిభాస్కర్, పాకం భాస్కర్, షేక్ జలీల్, రౌతు రాధాకృష్ణతో పాటుగా కార్యనిర్వాహక కార్యదర్శులుగా పొన్నా సుబ్రహ్మణ్యం, గురునాథం మునస్వామిరెడ్డి, బందిలి రవి, షేక్ మస్తానమ్మ, షేక్ మస్తాన్, ఎంబేడు లక్ష్మీదేవమ్మ, రవినూకల చెంచుకృష్ణయ్య, ఆనం వెంకటరమణయ్య, మల్లి అంకమ్మ, ఎంబేటి రమణయ్య, సంగీతం భాస్కర్, ఉమ్మడి చంద్రయ్య, ఎంబేటి బాబు, షేక్ గౌస్‌మొహిద్దీన్ ఎంపికయ్యారు.



కోట విద్యానగర్, చిల్లకూరు ఉట్టి కొడుతున్న యువకులు

కోలాహలంగా గణనాథుడి గ్రామోత్సవాలు

కోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గణనాథుడి గ్రామోత్సవాలు కోలాహలంగా జరిగాయి. చెందోడు, విద్యానగర్, విజయాకాలనీ, గూడలి తదితర గ్రామాల నుంచి వినాయక విగ్రహాలు గ్రామోత్సవం నిర్వహించారు. విద్యానగర్‌లో విద్యార్థుల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం నిర్వహించారు. శ్రీనివాససత్రం బీచ్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలు మండలాల నుంచి వినాయక విగ్రహాలను తీసుకువచ్చి నిమజ్జనం చేశారు.

చిల్లకూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు కూడళ్లల్లో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. ఆదివారం ఐదవ రోజు కావడంతో పలు విగ్రహాలను నిమజ్జనానికి తరలించనుండడంతో ఆయా మండపాల వద్ద ఉట్టి ఉత్సవం జరిపారు. స్థానిక దళితవాడలోని వినాయక విగ్రహం వద్ద యువకులు, చిన్నారులు చిందులు వేస్తూ ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆయా విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: స్థానిక దర్గావీధిలో ఏర్పాటైన 23 అడుగులతో వినాయక విగ్రహం వద్ద ఉట్టి ఉత్సవం నిర్వహించారు. టీడీపీ నాయకులు పొట్లపూడి రాజేష్, యువకులు ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. అలాగే రజక కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



నాయుడుపేటలో ఉట్టి ఉత్సవంలో యువత ఉత్సాహం

విద్యాబోధనలో మెలకువలు పాటించాలి

కోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో మెలకువలు పాటించాలని ఎంఈవోలు శిరీషా, మస్తానయ్య కోరారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని బాలుర ఉన్నత పాఠశాల, పెదగోవింద పల్లి ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం జరిగాయి. విద్యాబోధనలో పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంఈవోలు అవగాహన కల్పించారు. సమావేశంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తర భారతదేశానికి దోచిపెడుతున్న కేంద్రం



మీడియాతో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతదేశానికి దోచిపెడుతోందని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీసభ్యురాలు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ నాడు బ్రిటీష్ వారు దేశాన్ని దోచుకుంటే ఇపుడు కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలో పన్నుల రూపంలో వసూలుచేసి ఉత్తర భారతదేశానికి అత్యధికంగా దోచిపెడుతోందన్నారు. 2018 నుంచి దీనిపై పోరాటం జరుగుతూనే ఉందన్నారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణ భారతదేశంలో ఎంపీలు తగ్గే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉత్తర భారతదేశానికి చెందిన వారు నాటుకుపోవడంతో మన పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రజలు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జంగాలపల్లి శుభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లోపు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి కావాలి

తిరుపతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నవంబరులోపు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ మిషన్ ద్వారా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై శనివారం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సెప్టెంబర్ చివరిలోపు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తికావాలని సంబంధిత ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ రెండవ వారంలో లైవ్ ప్రారంభం కావాలని, నవంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎస్‌ఈ శ్యాంసుందర్, ఈఈ రవి, డీఈ రాజు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చి కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఒడిశా హైకోర్టు జడ్జి జస్టిస్ మురహరి, శ్రీరామన్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయక్, బేబీరాణి, కోర్టు పర్యవేక్షకులు పాల్గొన్నారు.

జ్ఞానసిద్ధి వినాయకుడి సేవలో బృందమ్మ


కళాకారులతో బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీవీధిలో వెలసిన జ్ఞానసిద్ధి వినాయకస్వామిని శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బృందమ్మ దర్శించుకున్నారు. ఆలయ ఆవరణంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యాలను తిలకించారు. చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. టీడీపీ నాయకులు కాసరం రమేష్, ఆలయ కమిటీ సభ్యులు మధు, కిషోర్, కుప్పయ్య, వరదరాజులు, జయసారథి, మహేష్, వివేక్, ఎంపీ ఎంపీ శీను, రాకేష్, నవీన్, శరవణ, బాబునాయుడు, కిషోర్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు జరిపించారు. స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేసి స్వామివారిని, అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం


వినాయకున్ని దర్శించుకుంటున్న పోతుగుంట విజయ్‌బాబు

పుత్తూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్య దర్శి పోతుగుంట విజయ్ బాబు పేర్కొన్నారు. శనివారం చిన్నరాజ కుప్పంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను ఆయన దర్శించుకున్నారు. అనంతరం దళితవాడలోని వినాయకుడిని దర్శించుకున్నారు. నాయకులు ధనపాల్, జనార్ధన్, పోతుగుంట రమేష్, మణికంత, రూపేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వృత్తికి విరామం మాత్రమే

- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్


మేనేజర్ మణిశంకర్ దంపతులను సత్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): ఉద్యోగ విరమణ వృత్తిపరమైన జీవితానికి విరా మం మాత్రమే అని, జీవితంలో కొత్త దశకు ఆరంభం అని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయ ఆవరణలో మున్సిపల్ మేనేజర్ మణిశంకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంత దంపతులను ఘనంగా సన్మానించారు. మేనేజర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించిన మణికంత విశ్రాంత జీవితం ఆనందకరంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చుడా ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, పుత్తూరు డీఈ లోకేష్, ప్రణాళిక విభాగం అధికారిణి నీరజాక్షి, రెవెన్యూ అధికారిణి పెంచలయ్య పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఆదాయం


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వేణుగోపాల్

పుత్తూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): సమగ్ర యాజ మాన్య పద్ధతుల తోనే రైతుకు ఆదాయం ఉంటుందని జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయధికారి వేణుగోపాల్ తెలిపారు. శనివారం పుత్తూరు డివిజన్‌లో రైతు సేవా కేంద్ర సిబ్బందికి డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ పద్ధతులను అమలు చేసినట్లయితే రైతుకు ఖర్చు తగ్గడమే కాక, ఆదాయం పెరగడంతో పాటు పర్యావరణానికి హితం చేకూరుతుందని తెలిపారు. అనంతరం వివిధ పథకాలు, పంట నమోదు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి, ఏఈవో రవిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాలలో అన్నదానం


మంచినీళ్ల గుంట వద్ద అన్నదానం

పుత్తూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): వినాయక చవితిని పురస్కరించకుని పుత్తూరులోని వినాయక మండపాలలో నిర్వాహకులు శనివారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణం లోని ఎంఎస్ఎం నగర్‌లో నాగలక్ష్మి ఆధ్వర్యంలో మహాలడ్డుప్రసాదం, భువనేశ్వరి, కరుణాకర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్వేటినగరం రోడ్డు, మంచినీళ్ల గుంట వద్ద ఏర్పాటు చేసినా వరసిద్ధి వినాయకస్వామి మండపంలో అన్నదానం చేశారు.

సింగిల్ విండో ఏటీఏం ఏర్పాటు చేయాలి

వడమాలపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వడమాలపేటలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏటీఏం ఏర్పాటు చేయాలని సింగిల్ విండో ఛైర్మన్ కుమార్ కోరారు. శనివారం వడమాలపేటలో నిర్వహించిన ప్రాథమిక రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు వెంకటరమణ, పొన్నయ్‌రాజు, సూపర్ వైజర్ రాజేష్, సిఈఓ కోటిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

భక్తులకు అన్నదానం

రేణిగుంట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకొని నాలుగో రోజు వినాయక ప్రతిమల వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం స్థానిక వడ్డీమిట్ట, జీఎం వీధి, పాంచాలి నగర్‌లో ఏర్పాటుచేసిన వినాయకుల ప్రతిమల వద్ద కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. డీఎస్పీ శ్రీనివాస్ హాజరై భక్తులకు అన్నదానం చేశారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు చేశారు. స్వామివారికి తైలాభిషేకం చేశారు.

పీఎం జన సురక్ష పథకంపై అవగాహన

శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలంలోని యార్లపూడి గ్రామంలో శనివారం పల్లం గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు ప్రధానమంత్రి జన సురక్ష పథకం, ఈకేవైసీపై అవ గాహన కల్పించారు. బ్యాంకు మేనేజరు శివానందరెడ్డి మాట్లాడుతూ రైతులు వారి పాసుబుక్కులకు సంబంధించిన ఈకేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష యోజన బీమా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ బత్తెమ్మ పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో కలెక్టర్ వెంకటేశ్వర్



ఏర్పేడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామిని శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ తన స్నేహితులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ మాజీ ఛైర్మన్ బత్తల గిరినాయుడు, కార్యనిర్వహణాధికారి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రూ.7వేలు పలికిన సుండికంద్రిగ లడ్డు



ఏర్పేడు, ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు మండలం సుండి కంద్రిగ గ్రామంలో శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలను గ్రామస్తులు నిర్వహించారు. అంతకు ముందు వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. గ్రామానికి చెందిన నీలేష్‌రెడ్డి రూ.7,516కు లడ్డూను దక్కించుకున్నాడు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, పలు శాఖలకు సంబంధించిన అధికారులకు శనివారం అవగాహన కల్పించారు. ఏపీవో దేవరి, ఏఈవో రేవతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే యూరియా అమ్మాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఏవో రామాంజనేయరెడ్డి

పిచ్చాటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీకే యూరియా విక్రయించాలని విజిలెన్స్ ఏవో ఎన్.రామాంజనేయరెడ్డి సూచించారు. శనివారం పిచ్చాటూరులోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎస్ఐ వెంకటరమణతో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచితవైద్య శిబిరం

వరదయ్యపాళెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం డాక్టర్ బొప్పన తేజస్వి ఆధ్వర్యంలో సూళ్లూరుపేట వీనస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

పవన్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం కేబీజీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

గిరిజనులకు చట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని గాజుపెళ్లూరు గిరిజన కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, మండల పరిషత్, పోలీసుశాఖ వారు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్రవర్ణాలు వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలు సమస్యలను గిరిజనులు అధికారులు దృష్టికి తీసుకు వచ్చారు. శ్మశానం ఆక్రమణకు గురైందని, కాలనీలో తాగునీటి కొరతతో ఉందని, పాత హౌసింగ్ ఇళ్లు కూలేదశలో ఉన్నాయని కొత్త గృహాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ జిల్లా అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథనాయుడు, వీఆర్వో వెంకటేశ్వర్లు, వార్డన్ సుభాషిణి, టీడీపీ నాయకుడు భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు శ్రీచైతన్య విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రూపాదేవి

శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28న తిరుపతిలో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో ఈ విద్యార్థులు విజయం సాధించారు. షాట్‌పుట్ అండర్-16 బాలుర విభాగంలో 9వ తరగతి చదువుతున్న జెషిత్ హర్ష మొదటి స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అండర్- 14 బాలికల విభాగంలో 8వ తరగతి చదువుతున్న యశస్వి రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. 7వ తరగతి చదువుతున్న ధృవి ఇదే విభాగంగా 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. శనివారం వారిని ప్రిన్సిపాల్ రూపాదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, కో-ఆర్డినేటర్ బాలాజీ, పీఈటీ మేఘన, ఇన్‌చార్జులు త్రివేణి, కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగర భవిష్యత్ అవసరాలు, ప్రణాళికపై పరిశోధన


స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన విద్యార్థులు, ప్రొఫెసర్లు

ఏర్పేడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో శనివారం నీతిబోధ్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌తో కలిసి 'అర్బన్ ఫ్యూచర్స్ - ప్లానింగ్ అండ్ పాలసీ కనెక్ట్' కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ ఏకతతో పాటు 33 మంది ఎస్‌పీఏ విద్యార్థులు హాజరయ్యారు. సస్టెయినబుల్ అర్బన్ ప్లానింగ్‌పై ఆమె కీలక ప్రసంగం చేశారు. అనంతరం విద్యార్థులు తిరుపతి నగర భవిష్యత్తు, అభివృద్ధిపై తమ పరిశోధనను వివరించారు. 2040 నాటికి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి స్థలం తక్కువయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. తిరుపతి ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా యాత్రిక, పర్యాటకంపై ఆధారపడి ఉందని, వ్యవసాయం, పరిశ్రమలు కూడా ప్రధానపాత్ర వహిస్తున్నాయని తెలిపారు. ఈ విశ్లేషణకు శాటిలైట్ చిత్రాలు, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్, మెషిన్ లెర్నింగ్ వినియోగించారు. ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వరుణ్ వర్గీస్ ఢిల్లీ మెట్రో ఆధారంగా ఆటోమేటిడ్ ఫేర్ కలెక్షన్ ద్వారా రద్దీ కొలతలపై ప్రసంగించారు. డాక్టర్ అర్వింద్ పాండే మున్సిపల్ ఫైనాన్స్ - సవాళ్లు, అవకాశాలపై మాట్లాడారు. తరువాత ఘన వ్యర్థాల నిర్వహణపై రౌండ్ టేబుల్ చర్చ జరిగింది. విద్యార్థులు పౌర సమాజం, సాంకేతిక వర్గం, ప్రభుత్వం, పర్యావరణ విధాన నిపుణులు, అర్బన్ ప్లానర్లు తరఫున ఐదు బృందాలుగా ఏర్పడి పరిష్కారాలు సూచించారు. భవిష్యత్తులో ఎస్‌పీఏ విజయవాడతో మరిన్ని సంయుక్త కార్యక్రమాలు చేస్తామని నీతిబోధ్ ప్రకటించింది.

శ్రీసిటీలో అలరించిన వీణావాదన


వీణా వాదం చేస్తున్న కళాకారిణి సుష్మ

సత్యవేడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఆధ్యాత్మిక. సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన వీణావాయిద్య కచ్చేరి భక్తులను అలరించింది. యువ కళాకారిణి వాకచర్ల సుష్మ త్యాగరాజు, అన్నమయ్య కృతులను మధురంగా రాగతాళాల సమన్వయంతో వీణావాదన చేసి అలరించారు. సుష్మ ప్రతిభను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమెరికా డెట్రాయిట్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త భరత్‌రెడ్డి సుష్మను అభినందిస్తూ జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి సంగీతానుభూతి పొందారు. శ్రీసిటీ పీఆర్వో పిల్లేటి బాబాజి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పాఠశాలలకు క్రీడా పరికరాల పంపిణీ



సత్యవేడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు హైదరాబాద్‌కు చెందిన జీటా గ్లోబల్ మేనేజ్ మెంట్ వీటూ హెల్ప్‌యూ సంస్థ రూ.81 వేలు విలువ కలిగిన క్రీడా పరికరాలను పంపిణీచేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రవి సమక్షంలో ఆ సంస్థ సభ్యులైన బాలచంద్రారెడ్డి, రాకేష్ చేతుల మీదుగా శనివారం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందించారు. సత్యవేడు జడ్పీ హైస్కూల్, బాలిక హైస్కూల్, ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, మాదనపాళెం, రాజగోపాలపురం, పీవీపురం, దాసుకుప్పం, మదనంబేడు, పుదుకుప్పం ఉన్నత పాఠశాలలకు ఈ క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

పౌరహక్కులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవేలూరు గిరిజ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ నందయ్య, ఆర్ఐ నల్లయ్య ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధార్, రేషన్‌కార్డు, కాలనీల్లో పారిశుధ్యం, రోడ్ల దుస్థితి, సంక్షేమ పథకాలు, ఇంటి స్థలాలు, ఇళ్లకు పట్టాలు, శ్మశానం కోసం స్థలం తదితర సమస్యలను కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు, ఆర్ఐ వారికి హామీ ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ సాయిబాబు, వీఆర్వో మోహన్, సీసీ కిరణ్, హనుమంత్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద కొలువైన విజయగణపతి ఆలయం వద్ద నిర్వాహకులు శనివారం భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రమణ, ఆకుల గురుమూర్తి, మధు, రమేష్, మురగయ్య, మురళి, సుధాకర్, వంశీ, మునస్వామి, మిథున్, ధనుష్, గురు, మోహన్, కృష్ణ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకస్వామికి ప్రత్యేక పూజలు


కొత్తవీరాపురంలో వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న టీడీపీ సీనియర్ నేత ఊటీ చంద్రశేఖర్‌యాదవ్

ఏర్పేడు, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు మండలం కొత్త వీరాపుర గ్రామంలో ఏర్పాటుచేసిన భారీ వినాయకస్వామి విగ్రహానికి శనివారం సాయంత్రం టీడీపీ సీనియర్ నాయకుడు ఊటీ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలుచేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరత్నంనాయుడు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, ఎంఈవో -2 ముని సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని నెలవాయి, బీఎన్‌కండ్రిగ, పల్లమాల ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


బీఎన్‌కండ్రిగలో అన్నదానం చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది. బీఎన్‌కండ్రిగ గ్రామంలోని ఈబీసీ కాలనీ, తూర్పు మిట్ట, వినాయక వీధి, కారణి, నెలవాయి, పార్లపల్లి, పదవ మైలు తదితర గ్రామాలలో వినాయక నిమజ్జనం కోలాహలంగా సాగింది. యువకులు ఉత్సాహంగా వసంతాలు పోసుకుని ఉట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాని ఊరేగించి జలదిలో నిమజ్జనం చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

వరదయ్యపాళెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ, పద్మావతిపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఢిల్లీ ప్రకాష్, డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు చేతుల మీదుగా శనివారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.